క్లుప్తంగా

శోభాయాత్రకు అపూర్వ స్వాగతం



ముమ్మిడివరంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ముమ్మిడివరం: అయోధ్య రామచంద్రుని అక్షతల కలశ శోభాయాత్రకు ముమ్మిడివరంలో భక్తులు అపూర్వ స్వాగతం పలికారు. రాజోలు నుంచి పాతూరి వీరవెంకట సత్యనారాయణ రాజు, వంగా విజయ సీతారాంలు శుక్రవారం శోభాయాత్రగా ముమ్మిడివరం రాగా స్థానిక ఆలయ అర్చకులు, గ్రామస్తులు, సమరత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం స్థానిక అభయాంజేయ స్వామి ఆలయంలో కలశానికి హారతులిచ్చి ఆలయంలో ఉంచారు. ఈ నెల 31 వరకూ కలశానికి నిత్య పూజలు, హనుమాన్ చాలీషా, రామ మంత్రం జరిపిస్తారు. జనవరి 1 నుంచి మండలంలో గడప గడపకూ అక్షతలు అందిస్తారు. కార్యక్రమంలో డి.మల్లికార్జునరావు, పాతూరి మూర్తిరాజు, పి.సుజాత, పాతూరి రామరాజు, సరిపెల్ల సత్తిబాబు, దొంగ సతీష్, కొయ్యల దుర్గ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

అమలాపురం టౌన్: ఎన్ఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఇంగ్లిషు ఒలింపియాడ్ (ఐఈఓ) అంతర్జాతీయ పరీక్షల్లో స్థానిక సర్ సీవీ రామన్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ చాటారని డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు తెలిపారు. జి.సంజనాదేవి 178, బి.వేదిక 356, మోరం దివిజ 486వ ర్యాంక్‌లు సాధించారన్నారు. విజేతలను స్కూల్ డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు, ఆర్.సత్యకుమార్, ఉపాధ్యాయులు ప్రశంసించారు.

మధుకుమార్‌కు డాక్టరేట్



అల్లవరం: ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న అధ్యాపకుడు బీపీఎస్ మధుకుమార్‌కు యూపీలోని జేఎస్ యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసింది. సెక్యూరిటీ ఎన్‌హేన్స్‌మెంట్ ఆఫ్ ఐఓటీ బేస్డ్ ఎడ్జ్ కంప్యూటింగ్ అనే అంశంపై ఆయనకు ఈ డాక్టరేట్ వచ్చింది. ఈ మేరకు మధుకుమార్‌ను బీవీసీ యాజమాన్యం అభినందించింది.

4 నుంచి విధుల బహిష్కరణ

అమలాపురం టౌన్: ఇటీవల అమలులోకి వచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను వ్యతిరేకిస్తూ ఈ నెల 4వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించేలా అమలాపురం బార్ అసోసియేషన్ నిర్ణయం తీసుకుంది. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఉండ్రు ఫణీంద్ర లక్ష్మణరావు అధ్యక్షతన శుక్రవారం న్యాయవాదుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ యాక్ట్ అమలు, తదనంతర పరిణామాలపై చర్చించింది. ఈ మేరకు కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వాలని సమావేశం తీర్మానించింది. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్, ప్రధాన కార్యదర్శి డి.వీర వెంకట సత్యనారాయణమూర్తి, సీనియర్ న్యాయవాది పినిపే రాధాకృష్ణ తదితరులు ప్రసంగించారు.

రాయితీ గ్యాస్‌కు నమోదు చేసుకోవాలి

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లకు అందిస్తున్న రాయితీకి యానాంలోని వినియోగదారులు తమ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని శుక్రవారం ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు. యానాంలో కేవలం 3,900 మంది రేషన్ కార్డుదారులు మాత్రమే గ్యాస్ రాయితీకి నమోదు చేసుకున్నారన్నారు. మిగిలిన వారు సైతం స్పందించాలన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన

ఉప్పలగుప్తం: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఉప్పలగుప్తంలో పార్వతీ సమేత మల్లేశ్వరస్వామివారి ఆలయంలో గ్రామస్తుల సహకారంతో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితుడు భైరవభట్ల సుబ్రహ్మణ్యేశ్వర శర్మ ఆధ్వర్యంలో మహాలింగాభిషేకం, లక్ష బిల్వార్చన, రుద్రహోమం నిర్వహించారు.

పోలీస్ సిబ్బంది యోగా సాధన

అమలాపురం టౌన్: ప్రతి శుక్రవారం వేకువ జామున పోలీసు సిబ్బందికి పెరేడ్, వ్యాయామ కార్యక్రమాల్లో భాగంగా యోగాపై శిక్షణ ఇచ్చారు. స్థానిక బాలయోగి స్టేడియంలో జిల్లా ఎస్పీ సునరాపు శ్రీధర్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, ఏఆర్ డీఎస్పీ విజయసారథి పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయండి

ఉప్పలగుప్తం: ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి ఎంఏ షంషీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కొఠారి వెంకటేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులకు శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలోని జగనన్న కాలనీల్లో 62, గ్రామీణ్‌లో జరుగుతున్న 79 ఇళ్లను జనవరి 31 లోగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ వెంకట్ పాల్గొన్నారు.

మనసున్న మారాజు సీఎం జగన్

- వచ్చే ఎన్నికల్లో తిరిగి గెలిపిద్దాం
- వైఎస్సార్ సీపీ నేతల పిలుపు
- గ్రామాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్'

అమలాపురం టౌన్: పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న మనసున్న మారాజు సీఎం జగన్ అని అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. స్థానిక 25వ వార్డులో శుక్రవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ దొంగ నాగ సుధారాణి అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, వార్డు పార్టీ అధ్యక్షుడు దొంగ చిన్నా, పట్టణ గృహ సారథుల కన్వీనర్ ఈతకోట శ్రావణ్‌కుమార్ ప్రసంగించారు. తొలుత సంక్షేమ పథకాల లబ్ధిని వార్డు ప్రజలకు వివరించారు. తర్వాత పార్టీ జెండాను, పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కౌన్సిలర్ కట్టోజు సన్నయ్యదాసు, కోఆప్షన్ సభ్యుడు జాన్ బెల్లీ పాల్గొన్నారు.

కాట్రేనికోన: సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపిద్దామని జెడ్పీటీసీ సభ్యుడు నేల కిశోర్ అన్నారు. కాట్రేనికోన, నడవపల్లిలలో సర్పంచులు గంటి వెంకట సుధాకర్, దొమ్మేటి పల్లవి అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి మాట్లాడుతూ సీఎం జగన్‌తో ప్రతి ఇంటికీ సంక్షేమ వెలుగులు వచ్చాయన్నారు. అనంతరం నాయకులు, వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచారు. వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు సంసాని నాగేశ్వరరావు, నడింపల్లి సూరిబాబు, వైస్ ఎంపీపీ సాబోయిన నాగేశ్వరరావు, పాకలపాటి సత్యమాంబికావర్మ, అక్కల శ్రీధర్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: కొమరగిరిపట్నం-2 సచివాలయంలో సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు మాట్లాడుతూ సచివాలయ పరిధిలో రూ.18.64 కోట్లు సంక్షేమానికి, అభివృద్ధికి ఖర్చు చేశామన్నారు.



అమలాపురంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న సత్య నాగేంద్రమణి



కాట్రేనికోనలో పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కొమరగిరిపట్నం సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు



పశువుల్లంకలో పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎంపీపీ తదితరులు

అనంతరం సంక్షేమ డిస్‌ప్లే బోర్డును జెడ్పీటీసీ కొనుకు గౌతమితో కలసి ఆవిష్కరించారు. ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, తిక్కా ప్రసాద్, కుడుపూడి శ్రీను, గుర్రం బాబులు, సతీష్, శేఖర్, కొనుకు బాబూరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనే రావాలి

ఐ.పోలవరం: సంక్షేమ పథకాలు అమలు కావాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే రావాలని మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు అన్నారు. పశువుల్లంకలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. మండల పార్టీ అధ్యక్షుడు పిన్నంరాజు వెంకటపతిరాజు, ఎంపీపీ మెర్ల రాణిమిరియం జ్యోతి మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి, సంక్షేమానికి రూ.26 కోట్ల నిధులు ఖర్చు చేశారని వివరించారు. అనంతరం పథకాల బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ సఖిలే పెద్దిరాజు, ధూళిపూడి చక్రం, సుంకర నాగబాబు, చింతా సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఉప్పలగుప్తం: చల్లపల్లి సచివాలయం-1 పరిధిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జీ అధ్యక్షతన ఏపీ వై నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. పథకాల డిస్‌ప్లే బోర్డును, పార్టీ జెండాను జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు ఆవిష్కరించారు. సర్పంచ్ ఇసుకపట్ల జయమణి, సొసైటీ అధ్యక్షుడు దంగేటి దొరబాబు, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, కోటుం లోవరాజు, భోగిశెట్టి నరసింగరావు, సుంకర చిన్నా, భీర బాలరాజు, పోలిశెట్టి రవి, గొలకోటి చంటి తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: కామనగరువు సచివాలయం-2 పరిధిలో సర్పంచ్ నక్కా అరుణకుమారి అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి దోలామణి, ఎంపీపీ కుదుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి ఆవిష్కరించారు. ఈవోపీఆర్డీ గుబ్బల మల్లికార్జునరావు, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

● క్రిస్మస్ వెలుగులొచ్చేశాయ్



విద్యుద్దీపాలతో క్రిస్మస్ ట్రీల నమూనా



మన్నా సిల్వర్ జూబ్లీ చర్చ్ ప్రాంగణంలో క్రిస్మస్ లైటింగ్ పార్కు

అమలాపురం టౌన్: స్థానిక నల్ల వంతెన వద్ద మన్నా జూబ్లీ చర్చ్ ప్రాంగణం క్రిస్మస్ సందర్భంగా విద్యుత్ వెలుగులతో అలరిస్తోంది. ఈ క్రిస్మస్ వెలుగులను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ శుక్రవారం రాత్రి ప్రారంభించారు. చర్చ్ ప్రధాన కాపరి, మన్నా విద్యా సంస్థల అధినేత కార్ల్ డేవిడ్ కొమానపల్లి (లాల్) ఆధ్వర్యంలో ఈ విద్యుద్దీపాలంకరణ ఏర్పాటైంది. ఈ నెల 1వ తేదీ నుంచి 2014 జనవరి 1వ తేదీ వరకూ నెల రోజుల పాటు ఈ లైటింగ్ పార్కు రోజూ రాత్రి ఆకర్షణీయంగా ప్రజలను అబ్బురపరిచేలా ఏర్పాట్లు చేసినట్లు చర్చ్ లీడ్ పాస్టర్లు ఎర్నెస్ట్, ఎస్తేర్ తాతపూడి తెలిపారు.

ఉపాధి పనుల్లో అవకతవకల గుర్తింపు



ముమ్మిడివరం సామాజిక తనిఖీ సభలో పీడీ మధుసూదనరావు తదితరులు

ముమ్మిడివరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ జె.రాంబాబు అధ్యక్షతన ఉపాధి పథకం సామాజిక తనిఖీ ప్రజా నివేదిక సభ జరిగింది. మండలంలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకూ మొత్తం 625 పనులకు రూ. 6,91,70,231 ఖర్చు చేశారు. అయితే మస్తరు రిజిస్టర్‌లో సంతకాలు, వేలు ముద్రలు లేకుండా ఎక్కువ మందికి కూలి చెల్లింపులు, పనులు చేసిన తక్కువ రోజులకు కూలి చెల్లింపులు వంటి లోపాలను గుర్తించారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌కు సంబంధించి రికార్డుల్లో నమోదైన దానికన్నా తక్కువగా ఉన్నట్లు నిర్ధారించారు. దివ్యాంగ మహిళలకు పింఛన్లు అందక పోవడం వంటి పలు లోపాలను తెలుసుకున్నారు. వీటికి సంబంధించి సిబ్బంది నుంచి రూ.8,500 రికవరీకి డ్వామా పీడీ ఎం.మధుసూదనరావు ఆదేశించారు. జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, కోలా బాబ్జీ మాట్లాడుతూ వరి నాట్లు వేసే సమయంలో ఉపాధి పనులు చేపట్టకుండా, రైతులకు ఉపయోగపడే పనులు నిర్వహించాలన్నారు. అంబుడ్స్ మెన్ ఎం.జ్యోతి, విజిలెన్స్ అధికారి కె.భీమేశ్వర్, హెచ్ఆర్ మేనేజర్ కె.సత్యనారాయణ, ఎంపీపీ కోలా గంగాభవాని, పాము చిట్టిబాబు, పెయ్యల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణకు అవగాహనే ఆయుధం



ముమ్మిడివరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు



ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: అవగాహనతోనే హెచ్ఐవీ, ఎయిడ్స్‌ను నివారించవచ్చని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవాన్ని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. అక్కడ హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులకు ఏర్పాటు చేసిన అల్పాహారం విందులో కలెక్టర్‌తో పాటు బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాయిరాజ్ సాత్విక్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు మనో ధైర్యంతో జీవించాలన్నారు. డీఎంహెచ్ఓ ఎం.దుర్గారావు దొర మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రతా పింఛన్లు ఇస్తూ భరోసాగా నిలుస్తోందన్నారు. ఎయిడ్స్ బాధితులకు ఉత్తమ సేవలందించిన 21 మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను కలెక్టర్ అందజేశారు. జల్లి సుజాత, వంటెద్దు వెంకన్ననాయుడు, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సమకూర్చిన పోషకాహార కిట్లను 40 మంది బాధితులకు పంపిణీ చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీహెచ్ భరతలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, బుచ్చిరాజు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: అవగాహనతోనే హెచ్ఐవీ, ఎయిడ్స్‌ను దూరం చేయవచ్చని మహిళా కళాశాల ప్రిన్సిపాల్ గండం శ్రీరామ్మూర్తి తెలిపారు. స్థానిక శ్రీకృష్ణదేవరాయ జూనియర్, రావు బహదూర్ రఘుపతి వెంకటరత్నం నాయుడు డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థినులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ గణేశుల బ్రహ్మానందం, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు నరసింహ పాల్గొన్నారు.

కాట్రేనికోన: స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ లికిత ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది జెడ్పీహెచ్ పాఠశాల, చైతన్య, సిద్ధార్థ కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. కాట్రేనికోన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ర్యాలీని లికిత ప్రారంభించారు. ఆరోగ్య సిబ్బంది రమాశేషు, వెంకటరమణ పాల్గొన్నారు.

ఐ.పోలవరం: కేశనకుర్రులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డి.శివగాయత్రి ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం ర్యాలీలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

యానాం: ఎయిడ్స్ వ్యాధిపై అందరూ అవగాహన పెంచుకోవాలని ఆర్ఏఓ మునిస్వామి అన్నారు. ఆరోగ్యశాఖ, వైజ్ ఎన్‌జీఓ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కొవ్వొత్తుల ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 వలంటీర్లు, జీజీహెచ్ డీడీ రవిశంకర్, మున్సిపల్ కమిషనర్ అరుశ్ ప్రకాశం, సొంతేణం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' విజయవంతం చేద్దాం



అల్లవరంలో సచివాలయ సిబ్బందికి స్పోర్ట్స్ కిట్లు అందిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



వార్డు సచివాలయ కార్యదర్శులకు స్పోర్ట్స్ కిట్లు ఇస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి

అల్లవరం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను విజయవంతం చేద్దామని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన ప్రభుత్వం అందజేసిన క్రీడా సామగ్రిని ఎమ్మెల్సీ చేతుల మీదుగా సచివాలయ సిబ్బందికి పంపిణీ చేశారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, తదితర క్రీడా కిట్లు అందజేశారు. జెడ్పీటీసీ కొనుకు గౌతమి, మండల ప్రత్యేకాధికారి మూర్తి, సొసైటీ అధ్యక్షుడు యల్లమిల్లి బోసు, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ ఎన్‌వీవీ సత్యనారాయణ, కార్యదర్శులు రాజమోహన్, కొనుకు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

తాళ్లరేవు: ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో యువత ఉత్సాహంగా పాల్గొనాలని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులకు స్పోర్ట్స్ కిట్లను ఆమె అందజేశారు. సునీత మాట్లాడుతూ 15 ఏళ్లు నిండిన బాల బాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ పోటీలు ఉంటాయన్నారు. మండలంలోని 24 సచివాలయాలకు క్రీడా సామగ్రి అందజేశారు. ఎంపీడీఓ ఎం.అనుపమ, ఈఓపీఆర్డీ మల్లాడి భైరవమూర్తి, ఏఓ చింతా మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని సమష్టిగా విజయవంతం చేద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి పిలుపునిచ్చారు. ప్రభుత్వం నుంచి పట్టణానికి విడుదలైన స్పోర్ట్స్ కిట్స్‌ను వార్డు సచివాయాల కార్యదర్శులకు శుక్రవారం ఆమె పంపిణీ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే క్రీడల్లో 15 ఏళ్ల వయసు నుంచి ఎవరైనా పాల్గొనవచ్చని అన్నారు. ఉత్సాహవంతులైన క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాల కోసమే భూములిచ్చాం..

- నారా లోకేష్ వ్యాఖ్యలు సరికావు
- ఖండించిన చొల్లంగి భూ యజమానులు, రైతులు



చొల్లంగి ఆంజనేయస్వామి ఆలయం వద్ద సమావేశమైన భూ యజమానులు

తాళ్లరేవు: కాకినాడకు అత్యంత సమీపంలోని తమ విలువైన భూములను పేదల ఇళ్ల స్థలాల కోసం ఇచ్చామని, భూముల కొనుగోలులో భారీ కుంభకోణం జరిగిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేసిన వ్యాఖ్యల్లో నిజం లేదని చొల్లంగి భూ యజమానులు, రైతులు ముక్తకంఠంతో ఖండించారు. జగనన్న లేఅవుట్‌లకు సంబంధించి భూములిచ్చిన యజమానులు, రైతులు శుక్రవారం చొల్లంగి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సమావేశమయ్యారు. వైఎస్సార్ సీపీ నాయకుడు బూరెల వెంకట్రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన వారు పాల్గొని లోకేష్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

ఈ సందర్భంగా రైతులు కాశి గోవిందరాజులు, టీడీపీ మాజీ వైస్ ఎంపీపీ, రైతు కనకాల సిద్ధి శేషారావు, గర్రే లక్ష్మీనారాయణ, రాపర్తి సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ చొల్లంగి ప్రాంతంలో ఎకరం భూమి రూ. కోటి వరకూ పలుకుతుందని, అయినప్పటికీ ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేదల ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం సూచించిన ధరకు ఇవ్వాలని కోరడంతో ఎకరం రూ.61 లక్షలకే ఇచ్చామన్నారు. సర్వే నంబర్లు 30, 35, 36, 42లలో సుమారు 175 ఎకరాల భూమిని ప్రభుత్వానికి ఇచ్చామని, ప్రతి రైతు అకౌంట్‌కు ఒక్క రూపాయి కూడా తేడా లేకుండా నగదు జమ చేశారని తెలిపారు. రూ.15 లక్షలకు కొని రూ.50 లక్షల వరకూ వసూలు చేశారని లోకేష్ మాట్లాడడం తమను ఎంతగానో బాధించిందన్నారు. తమ ప్రాంతంలోనే కాదు మండలంలో ఎక్కడా రూ.15 లక్షలకు ఎకరం భూమి రాదని, ఎవరో ఇచ్చిన స్క్రిప్ట్‌ను చదవి లోకేష్ అబాసుపాలయ్యారన్నారు.

భూముల కొనుగోలులో ఎటువంటి కుంభకోణం జరగలేదని వారు స్పష్టం చేశారు. నాయకులు బూరెల వెంకట్రాజు, మైదు హరిబాబు, శివాజీ గణేష్, మాసా శ్రీనివాస్, వారా సూర్యకుమారి తదితరులు మాట్లాడుతూ మచ్చలేని తమ నాయకుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌పై ఆరోపణలు చేయడం దారుణమన్నారు. మత్స్యకారులకు ఓఎన్జీసీ పరిహారం అందిందని, ఎటువంటి అవినీతి జరగలేదని మత్స్యకార నాయకుడు, చొల్లంగిపేట మాజీ సర్పంచ్ మైదు హరిబాబు తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి మూర్తి

అల్లవరం: పేదలందరికీ ఇళ్లు పథకంలో జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు గృహ నిర్మాణాలు వేగవంతంగా చేపట్టేలా అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి కేవీవీఎస్ఎన్ మూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై సమీక్షించారు. ఎంపీడీఓ కృష్ణమోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మూర్తి మాట్లాడారు. డిసెంబర్ 31 లోగా జగనన్న కాలనీల్లో లబ్ధిదారులంతా నిర్మాణాలు ప్రారంభించేలా నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపడతామన్నారు. హౌసింగ్స్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హౌసింగ్ సిబ్బందికి పంచాయతీ కార్యదర్శులు సహకారం అందించాలన్నారు. ప్రతి వారం ప్రగతిపై సమీక్షిస్తామన్నారు. తహసీల్దార్ సాంబశివప్రసాద్, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వామి, ఏపీఎం సయ్యద్, ఏపీఓ శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించుకోండి



వ్యాపారులతో సెంట్రల్ ఎక్సైజ్ శాఖ సదస్సు

యానాం: వ్యాపారులు తమకు సంబంధించిన సమస్యలను సెంట్రల్ ఎక్సైజ్ శాఖ దృష్టికి తీసుకువెళ్తే పరిష్కరించుకోవచ్చని పుదుచ్చేరి సెంట్రల్ ఎక్సైజ్ అదనపు కమిషనర్ కాకర్ల ప్రశాంతకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంజీజీబీహెచ్ హైస్కూల్‌లో పుదుచ్చేరి సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ ఆధ్వర్యంలో యానాం వ్యాపారులతో ఎంఎస్ఎంఈ వాణిజ్య సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు జీఎస్టీ పరంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కారైకల్ సెంట్రల్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ నారాయణన్, సూపరింటెండెంట్ రాజశేఖర్, యానాం వర్తక సంఘ గౌరవ అధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్, ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, రీజెన్సీ ప్లాంట్ హెడ్ మోహన్ పాల్గొన్నారు.

పరిశోధనలపై ఆసక్తి పెంచాలి



సైన్స్ ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్, ఆర్ఏఓ మునిస్వామి

యానాం: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పరిశోధనలపై ఆసక్తి పెంచేలా బోధన ఉండాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అన్నారు. శుక్రవారం స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో ప్రాంతీయ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సైన్స్‌పై అందరూ ఇష్టాన్ని పెంచుకోవాలని, తద్వారా ప్రయోగాత్మక, పరిశోధనా విజ్ఞానాన్ని పొందవచ్చన్నారు. అనంతరం వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లకు చెందిన విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ఎగ్జిబిట్స్‌ను ఆయన పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఆర్ఏఓ మునిస్వామి, ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కె.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ అభినందన



విద్యార్థులను, డీఈఓ కమలకుమారిలను అభినందిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: రాష్ట్ర స్థాయి సైన్స్ కాంగ్రెస్‌లో పులస మన మత్స్య సంపద కాపాడుకుందాం అనే ప్రాజెక్టును ప్రదర్శించి జాతీయ స్థాయికి సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. గుంటూరు కేఎల్ యూనివర్సిటీలో జరిగిన ఈ సైన్స్ కాంగ్రెస్‌లో దీనిని ప్రదర్శించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కమలకుమారి, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ నంద్యాల మనువిహార్, పాఠశాల ప్రిన్సిపల్ దేవి దీక్షిత్‌లు కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలసి వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులు చైతన్య దీపిక, రిషిమలను కలెక్టర్ అభినందించారు.

తుపానుతో అప్రమత్తంగా ఉండాలి

యానాం: దక్షిణ అండమాన్ సముద్రంలో మలక్కా జలసంధిని ఆనుకుని ఏర్పడిన అల్పపీడనం క్రమంగా మిచాంగ్ తుపానుగా మారుతున్న నేపథ్యంలో యానాం తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్ఏఓ మునిస్వామి కోరారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

విద్యా సంస్థలకు 4న సెలవు

మిచాంగ్ తుపాను ఈ నెల 4న తీరం దాటుతున్న నేపథ్యంలో యనాంలో పాఠశాలలకు సెలవును పుదుచ్చేరి డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పి.ప్రియదర్శిని ప్రకటించారు. ఈ మేరకు సెలవును ప్రాంతీయ విద్యాశాఖాధికారి పీఎల్ ప్రవీణ్ ధ్రువీకరించారు.